క్లుప్తంగా

12 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

లింగాల: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదివాసులకు రాజకీయ శిక్షణ తరగతులు రెండో దశ ఈ నెల 12, 13, 14 తేదీలలో కృష్ణ పరివాహక ప్రాంతమైన సోమశిలలో నిర్వహిస్తునట్లు జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, అచ్చంపేట అసెంబ్లీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రాథోడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో ఏఐసీసీ అగ్రనాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. నల్లమల ప్రాంతానికి చెందిన ఆదివాసులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

మన్ననూర్: సబ్‌స్టేషన్ పరిధిలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరాలో మార్పుల చేసినట్లు ఏఈ రమేష్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ బోరు మోటార్ల వినియోగం కోసం రైతులకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6:00 నుంచి 9:00 గంటల వరకు మన్ననూర్ కు, 9:12 నుంచి వెంకటేశ్వర్లబావికి, 12:03 గంటల నుంచి మన్ననూర్ కు, 3:00 నుంచి 6:00 గంటల వరకు వెంకటేశ్వర్లబావికి, ఆ తర్వాత రాత్రి 7:00 గంటల నుంచి ఉదయం 6:00 వరకు సింగిల్ ఫేజ్ (గృహ వినియోగదారులకు) నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.

చెంచు కుటుంబానికి చేయూత



లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన నిమ్మల లక్ష్మమ్మ కుటుంబానికి నియోజకవర్గం టీఎన్జీవో యూనియన్ బాసటగా నిలిచింది. నిమ్మల శంకర్ అనే చెంచు వ్యక్తి ఐదు నెలల కిందట అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవికి వెళ్లి తిరిగి రాలేదు. దీనితో ఆయన భార్య లక్ష్మమ్మ, ఐదుగురు సంతానం ఎదురుచూస్తున్నారు. నెలలు గడుస్తున్నా ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న టీఎన్జీవో నాయకులు ఆదివారం చెంచు పెంటను సందర్శించి కొన్ని నెలలకు సరిపడు బియ్యం, ఇతర నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.రాములు, గౌరవ అధ్యక్షుడు కంప శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, బీట్ ఆఫీసర్ రమేష్, యూనియన్ నాయకులు ఆంజనేయులు, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం అందజేత



తాడూరు/కల్వకుర్తి: కల్వకుర్తిలో నివాసం ఉండే తిరుపతమ్మ భర్త నందు పక్షవాతంతో బాధపడుతున్నాడు. కుటుంబపోషణ భారం కావడంతో తిరుపతమ్మ క్లాస్‌మేట్స్ తాడూరు ఉన్నత పాఠశాల 1994–95 పదో తరగతి బ్యాచ్ మిత్రులు స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.22,500లు ఆర్థికసాయం అందజేశారు. క్లాస్‌మేట్ సభ్యులు కృష్ణారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రామాచారి, రమేష్‌చారి, సైదులు, భాస్కరాచారి, శ్రీపాల్‌రెడ్డి ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య, నాగమ్మ, మహేష్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబాలకు సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు జిల్లెల రాములు రూ.6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బాల్ జంగయ్య ఉన్నారు.

● పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అక్షిత ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం విద్యార్థిని అక్షితకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మాజీ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, ఆకుతోట నరేష్ సభ్యులు పాల్గొన్నారు

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన శ్యాంపూరి గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం 10వ తరగతి స్నేహితులు రూ.1.57లక్షలు, ఇంటర్మీడియట్ స్నేహితులు రూ.17500, పీజీ మిత్రులు రూ.30 వేల చొప్పున సమకూర్చి బాధితుని భార్య శివలీలకు ఆర్థికసాయం అందజేశారు.

● మండలంలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని ఆరాధ్య బాలానగర్‌లోని గురుకుల పాఠశాలల్లో అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆదివారం జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి బాధిత కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనలో అవస్థలు



పెద్దకొత్తపల్లి రెగ్యులర్ డాక్టర్ లేని పశువైద్యశాల

పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ శాఖలలో ముఖ్యమైన అధికారుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఇన్‌చార్జ్ అధికారులను ప్రభుత్వం నియమించింది. గ్రామాల్లో సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆయా శాఖలలో..

పశు వైద్యశాలలో ఇన్‌చార్జ్ డాక్టరు మధును నియమించారు. పశు వైద్యశాలకు వారానికి ఒక రోజు వచ్చి వెళ్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వైద్యుడు మధు తెలకపల్లి మండలంలో రెగ్యులర్ పోస్టు కావడంతో పాటు పెద్దకొత్తపల్లి మండలానికి ఇన్‌చార్జ్ కొనసాగుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, వెనచర్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌చార్జ్ డాక్టర్లు ఉండడం వలన ప్రజలకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఇన్‌చార్జ్ డాక్టర్‌గా విజయ్ కుమార్ కొనసాగుతున్నారు. అయన రెగ్యులర్ పోస్టు బల్మూరు మండలం ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు స్టాఫ్ నర్స్, ఏఎన్ఎంలు సేవలు అందిస్తున్నారు. వెనచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి డాక్టర్ ప్రశాంత్‌ను ఇన్‌చార్జ్ డాక్టర్‌గా నియంమించారు. డాక్టర్ ప్రశాంత్‌కు పెద్దకొత్తపల్లిలో రెగ్యులర్ పోస్టు ఇచ్చారు. వెనచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ లేక పోవండంతో ఇన్‌చార్జ్ డాక్టర్‌గా నియమించారు. పెద్దకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రెగ్యులర్ 2 డాక్టర్ పోస్టులు, 2 స్టాఫ్ నర్స్ పోస్టులు, 2 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెనచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక డాక్టర్ పోస్టు, ఒక స్టాఫ్ నర్స్, 2 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విద్య, రెవెన్యూశాఖలో..

పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డిని ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. మండలంలో 10 ఉన్నత పాఠశాలల్లో 20 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో 15 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది.

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఎంపీడీఓ కార్యాలయంలో మూడు పంచాయతీ కార్యదర్శిల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇన్‌చార్జ్ అధికారులు ఉండడంతో ప్రజలకు పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు.

పశువైద్యుడిని నియమించాలి



పశు వైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్ లేక పోవడంతో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి. పశువులకు, గొర్రెలకు, మేకలకు సరైన వైద్యం అందడం లేదు. ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–నరసింహ, రైతు, పెద్దకొత్తపల్లి

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ఆయా శాఖల జిల్లా అధికారుల దృష్టి తీసుకెళ్తాం. నివేదికలు పంపిస్తాం. సిబ్బంది తక్కువగా ఉన్నది వాస్తవమే. సమస్యలు రాకుండా చూస్తున్నాం.

–జేకే మోహన్, తహసీల్దార్, పెద్దకొత్తపల్లి

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు



తుర్కలపల్లిలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

చారకొండ: మండలంలోని జూపల్లి, గోకారం, తుర్కలపల్లి, సిర్సనగండ్ల, అగ్రహారం గ్రామాల్లో ఆదివారం జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షించి నిధుల అక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఏపీఓ లక్ష్మయ్య మాట్లాడుతూ మండలంలోని 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ. 2.68 కోట్ల తో చేపట్టిన పనులపై ఆడిట్ చేస్తునట్లు పేర్కొన్నారు. ఈనెల 13 మండల కేంద్రంలో సామాజిక తనిఖీ, సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఆర్పీ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి, కుప్పగండ్ల, పోతేపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం జాతీయ ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించారు. 2023–2024 జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పీ బద్రునాయక్ తెలిపారు. గ్రామాల్లో చేసిన పనులను పరిశీలించి అక్రమాలను గుర్తించడానికి ప్రభుత్వం సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టాఫీసుల ఖాతాల వల్ల కూలీలకు డబ్బులు సక్రమంగా అందడం లేదని తనిఖీ బృందం గుర్తించారు. ఈనెల 14న మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, డీఆర్పీలు తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు



తుర్కపల్లి గ్రామంలో విక్రయిస్తున్న కల్తీకల్లు(ఫైల్)

మన్ననూర్: కల్తీకల్లు, సారా నిషేధానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా నిత్యం ఎక్కడోచోట విక్రయాలు కొనసాగుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగా కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా కల్తీకల్లును విక్రయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాణాల పోతున్నా పాలకులు పట్టించుకోవడంలో పలువురు ఆవేదన వ్యక్త చేశారు. అమ్రాబాద్ మండలంలో కల్తీకల్లు విక్రయాలు యథేచ్ఛగా కొనసాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని తుర్కపల్లిలో ప్రతి నిత్యం ఇతర ప్రాంతాల నుంచి కల్తీకల్లు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. కల్తీకల్లు తాగి ఇప్పటికి గత ఐదారేళ్లలో 10 మంది వరకు మృతిచెందారు. గతంలో అమ్రాబాద్ పోలీసుల ప్రోత్సాహంతో గ్రామానికి కల్తీకల్లు, సారా రానివ్వకుండా గ్రామపెద్దల సహాయంతో కొందరు యువకులు కట్టడి చేశారు. క్రమంగా కల్తీకల్లు, సారా వ్యాపారులు ఇచ్చే డబ్బులు, ప్రలోభాలకు ఆశపడి గ్రామస్తులే దొంగ చాటుగా గ్రామానికి సరఫరా చేస్తుండంతో ప్రస్తుతం గ్రామంలో కల్తీకల్లు, సారా విక్రయాలు అధికమయ్యాయి. దీంతో ప్రతి నిత్యం కుటుంబాలలో కొట్లాటలు గొడవలు సర్వ సాధారణమయ్యాయి. ఇదిలా ఉండగా అమ్రాబాద్ మండలంలోని వివిధ ప్రాంతాలలో కొద్దిపాటి ఈతకల్లు మాత్రమే వస్తుంది. ఈ కొద్దిపాటిని ఈత కల్లును బూచిగా చూపిస్తూ కల్లు విక్రయదారులు డైజోఫామ్ అనే మత్తు పదార్థాన్ని నీటితో కలిపి మండంలోని తుర్కపల్లి, మాచారం, ప్రశాంతి నగర్, వటువర్లపల్లి, మన్ననూర్ తదితర గ్రామాలలో విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారు. కల్తీకల్లు అని తెలిసిప్పటికి కల్లుకు బానిసలుగా మారిన కల్లు ప్రియులు ఎక్కువగానే సేవిస్తున్నారు. మరింత మత్తు ఎక్కిందుకు విక్రయదారులు డైజోఫామ్ అనే మత్తు పదార్థాన్ని ఎక్కువ మొత్తంలో కలుపుతున్నారు. రెండు మూడు రోజులు కల్లు దొకరని పక్షంలో పిచ్చివాళ్లుగా ప్రవర్తిస్తున్నారు. కల్తీ కల్లు నిర్వాహకులు నెల నెల ఇచ్చే మామూళ్లకు అలవాటు పడిన సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీకల్లు, సారాతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి కల్తీ కల్లు నుంచి గ్రామస్తులను కాపాడాలని కోరుతున్నారు.

కల్తీ కల్లును కట్టడి చేయాలి



గత ఐదారేళ్లలో కల్తీ కల్లు తాగి 10 మంది వరకు మృతి చెందారు. అమ్రాబాద్ మండల కేంద్రం నుంచి గ్రామానికి ప్రతి రోజు కల్తీకల్లు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు కల్తీకల్లు తాగి వింతగా ప్రవర్తించడం, ఇతరులు, కుటుంబ సభ్యులతో తరుచుగా గొడవలు పడుతున్నారు. అధికారులు గ్రామానికి కల్తీ కల్లు, సారా రాకుండ చూడాలి.

–ఏకుల ధర్మయ్య, తుర్కపల్లి

కఠిన చర్యలు తీసుకుంటాం

గ్రామాలలో కల్తీకల్లు, సారా అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తాం. నిందితులపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే తుర్కపల్లిలో పలుమార్లు సోదాలు చేయడంతో పాటూ కొందరిపై కేసులు కూడా చేశాం. గ్రామస్తులు సహకరిస్తే కల్తీకల్లు, సారా పూర్తిగా నివారణకు చర్యలు తీసుకుంటాం.


–సతీష్, ఎక్సైజ్ ఎస్ఐ, అచ్చంపేట

హనుమాన్ దేవాలయ అభివృద్ధికి కృషి



కల్వకుర్తి రూరల్: మండలంలోని జంగారెడ్డి పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయాన్ని ఆదివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు రాఘువేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిండి లింగారెడ్డి, అల్వాల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పరమేశ్వర్, బన్నె శీను, శ్రీధర్, రాములు, ఆంజనేయులు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లోని శ్రీదేవి-భూదేవి వేంకటేశ్వర్ల స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడోరోజు ఆదివారం స్వామి వారిని హనుమంతు వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడారు. ఆలయ పూజారి శేశచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చారకొండ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వంట సహాయకుల పోస్టులను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఎంఈఓ ఝాన్సీరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

నేడు వీరభద్రుడి ఊరేగింపు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం వీరభద్రుడి ఊరేగింపు నిర్వహిస్తునట్లు గురుస్వామి పలుస విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ శివాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమై కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. శివమాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బండలాగుడు పోటీలు ..

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లిలో బుగ్గ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా 10న అంతర్రాష్ట్ర న్యూ క్యాటగిరి వృషభరాజుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్, కార్యదర్శి, దర్శి రాజయ్య, కందూరి లక్ష్మణ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ. 40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు అందజేయనునట్లు వివరించారు.

భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే సహించం



ఏఈఓతో మాట్లాడుతున్న నాయకులు

కొల్లాపూర్: సింగోటం లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలిగించేలా ఆలయ సిబ్బంది వ్యవహరిస్తున్నారని, తీరుమార్చుకోకుంటే హిందూ సంఘాలను ఏకంచేసి ఆందోళనలు చేపడతామని బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం సింగోటం ఆలయంలో ఏఈఓ జైపాల్‌రెడ్డిని నాయకులు కలిశారు. దేవుని దర్శనానికి క్యూలైన్లలో వచ్చే భక్తులతో సిబ్బంది అమర్యాదకరంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను చూపించారు. ఆలయం ద్వారా వచ్చే ఆదాయంపై మాత్రమే అధికారులు దృష్టిపెడుతున్నట్లుగా కనిపిస్తోందని, ఇప్పటికైనా తీరు మార్చుకొని భక్తులకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. ఏఈఓను కలిసిన వారిలో భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షులు పురేందర్, బీజేపీ నాయకులు సాయికృష్ణగౌడ్, గుగ్గిళ్ల మహేష్, రవి, శివ, పల్లె మహేష్, శివమణి, నాగమల్లి, కుమార్, ఆనంద్ తదితరులున్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న రైతులు

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.బాలపీరు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఆదివారం మండలంలోని ముక్కిడిగుండం గ్రామంలో రైతులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా పెట్టుబడిదారి వ్యవస్థకు అనుకూలంగా పనిచేస్తోందన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా సోమవారం ధర్నాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, బాలస్వామి, రాము, వెంకట్రాములు, చంద్రయ్య, కృష్ణయ్య, హుస్సేన్, బొజ్జన్న తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజు ఆదివారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా అవహిత దేవతహోమం, ప్రదోషపూజలు, పంచామృత విగ్రహ అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులు మన్నె ప్రశాంత్‌సాయిశ్వర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు శ్రావణ్, పవన్, శరత్‌చంద్ర, సంతోష్, భాస్కర్‌శర్మ, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

తెలకపల్లి: మండలంలోని పెద్దూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–2002 పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. తోటి మిత్రుడు ఎ బాలస్వామి అనారోగ్యంతో బాధపడుతుండటంతో రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. గురువు రిటైర్డ్ హెచ్ఎం రుక్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నరహరి, సుగుణ, విద్యార్థులు చంద్రశేఖర్, సంతోష్, శివప్రసాద్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



తిమ్మాజిపేట: మండలంలోని గొరిటలో ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.13 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం కాలనీలో కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనులను ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కొల్లాపూర్: ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆసంఘ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ జెండాను ఈశ్వరయ్య ఆవిష్కరించారు. సంఘంలో పనిచేసిన రిటైర్డ్ ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, నీలంరెడ్డి, విజయేందర్‌సింగ్‌లను సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్‌గౌడ్, సీవీ.రావు, శ్రీకాంత్, రాంచంద్రయ్య, జగన్మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, రామన్‌గౌడ్, బషీర్, గోవింద్‌గౌడ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్ష



కొల్లాపూర్: మండలంలోని రామాపురంలో దీర్ఘకాలంగా తిష్టవేసిన సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమ నాయకుడు ఆకునమోని చంద్రయ్య ఆదివారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. గ్రామంలోని రచ్చబండ వద్ద ఆయన దీక్షలో కూర్చున్నారు. సమస్యలను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి



చారకొండ: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని గిరిజన నాయకుడు, మాజీ సర్పంచ్ ప్రశాంత్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గిరిజన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న సేవాలాల్ జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని తండాల నుంచి గిరిజనులు, గిరిజన నాయకులు భారీగా హజరుకావాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు సాయికుమార్ నాయక్, రవి కుమార్ నాయక్, రవి నాయక్, రూప్‌సింగ్, హరిలాల్, బాలు నాయక్, జుమ్లా నాయక్, హనుమంతు నాయక్, హరినాయక్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని నాగనూలులో కల్లు గీత కార్మికుడు శ్రీనివాస్ గౌడ్ చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెదాడు. ఆదివారం రాష్ట్ర గౌడ సంఘం, జిల్లా నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పకీర య్య గౌడ్, జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు కిషోర్ గౌడ్, పెద్దపల్లి మాజీ సర్పంచ్ బాలస్వామి గౌడ్, నాయకులు ఉన్నారు.

మూడు కిలోల కణితి తొలగింపు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ కడుపులో నుంచి మూడు కిలోల కణితిని తొలగించినట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన పుష్ప తీవ్ర కడుపునొప్పితో, రక్తస్రావంతో బాధపడుతూ జనరల్ ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన గైనకాలజిస్టు ప్రొఫెసర్లు డా.నీలిమ, డా.సుప్రియలు మహిళను కడుపులో 3 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. అత్యవసరంగా శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించారు. మహిళ కడుపులో కణితిని తొలగించి ప్రాణాలను కాపాడటంతో వైద్యులను అభినందించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

లింగాల: మండలంలోని దారారం గ్రామానికి చెందిన పలగొర్ల సత్యం యాదవ్(40) అదృశ్యమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న భార్య ఇందిరమ్మతో గొడవపడ్డాడు. 7న భార్యకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.